క్లుప్తంగా

వాహనాల వేలం ద్వారా రూ 3.60 లక్షల ఆదాయం

హుజూర్‌నగర్ : వాహనాల వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.3.60 లక్షల ఆదాయం లభించినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి లక్ష్మానాయక్, ఇన్‌స్పెక్టర్ నాగార్జునరెడ్డి తెలిపారు. హుజూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు శుక్రవారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు కేసులలో పట్టుబడిన 23 వాహనాలకు ప్రభుత్వం ధర 1.82 లక్షలుగా నిర్ణయించగా వేలంపాటలో జీఎస్టీతో కలుపుకుని రూ 3.60 లక్షల ఆదాయం లభించిందని చెప్పారు. అనంతరం గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం (సేఫ్టీ కిట్స్) పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ జగన్ మోహనరెడ్డి, కానిస్టేబుల్ గోపిరెడ్డి, నాగరాజు, గీత కార్మిక సంఘం నాయకులు, గీత కార్మికులు పాల్గొన్నారు.

గౌరవ డాక్టరేట్ పొందిన నాగరాజుకు సన్మానం



నాగరాజును సన్మానిస్తున్న స్థానికులు

చిలుకూరు : మండలంలోని ఆచార్యులగూడెం గ్రామానికి చెందిన మొలుగూరి నాగరాజు ఇటీవల గౌరవ డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో పలువురు చిలుకూరు గ్రామస్తులు ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నాగరాజు యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో స్వాతంత్ర్య సమరయోధుడు దొడ్డా నారాయణరావు, డాక్టర్ సుబ్బారావు, మాజీ జెడ్పీటీసీ గన్నా చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ కొండా అన్నపూర్ణ, గ్రంథాలయం మాజీ అధ్యక్ష, కార్యదర్శులు అంబాల వెంకటి, పిల్లుట్ల కృష్ణయ్య, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితురాలికి ఆర్థికసాయం



సంధ్యకు నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మోతె : మండలంలోని నామవరం గ్రామానికి చెందిన గడ్డం సంధ్య గుండె, ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతోంది. దీంతో సంధ్యతో పాటు నర్సింహులగూడెం ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆమెకు రూ.41,000 ఆర్థికసాయం అందజేసి అండగా నిలిచారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించాలి



మోడల్ స్కూల్ ఆవరణలో దోమల మందు పిచికారీ చేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది

మునగాల : వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించాలని ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు వసతి గృహాల్లో మునగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సిబ్బంది సహకారంతో ఆయన దోమలమందు పిచికారీ చేయించి మాట్లాడారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ అక్షయ, సిబ్బంది సురేష్, గ్రామపంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



మృతి చెందిన గేదె

చిలుకూరు : విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన ఘటన శుక్రవారం చిలుకూరు మండల కేంద్రంలో జరిగింది. చిలుకూరు గ్రామంలో రైతు మాదారపు చిన వెంకటికి చెందిన గేదెను రోజుమాదిరిగానే మేత కోసం పొలాలకు తోలగా జానకీనగర్ స్టేజీ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి గేదె అక్కడిక్కడే మృతి చెందింది. మృతి చెందిన పాడి గేదె విలువ రూ. లక్ష ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

బీజేపీకి 'స్థానిక' ఎన్నికలు పెట్టమనే హక్కు లేదు

మిర్యాలగూడ టౌన్ : స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టాలని అడిగే హక్కు బీజేపీకి లేదని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక బీసీ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట మురళియాదవ్ తదితరులు ఉన్నారు.

వన మహోత్సవానికి మొక్కలు సిద్ధం

- నర్సరీల్లో 1.48, 850 మొక్కలు
- వర్షాలు కురవగానే నాటేందుకు అధికారుల ప్రణాళిక



గరిడేపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

గరిడేపల్లి : పట్టణాలు, గ్రామాల్లో పచ్చదనం పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం వన మహోత్సవం కార్యక్రమం చేపడుతోంది. ఈ ఏడాది వర్షాలు కురవగానే మొక్కలు నాటించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇప్పటికే నర్సరీల్లో ఏపుగా పెరిగిన మొక్కలను నాటేందుకు, పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచారు. గరిడేపల్లి మండలంలో 32 గ్రామ పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతున్నారు. ప్రస్తుతం మండలంలోని అన్ని నర్సరీల్లో 1,48, 850 మొక్కలు ఉన్నాయి. అందులో 98, 916 మొక్కలను ఇళ్ల ముందు, ఇళ్లలో నాటేలా చర్యలు తీసుకుంటున్నారు. మిగిలిన 49, 934 మొక్కలను రోడ్ల వెంట, రైతువేదికల వద్ద, శ్మశాన వాటికలు, పాఠశాలల్లో నాటాలని నిర్ణయించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నాలుగు వేల ఈత మొక్కలను కూడా నర్సరీల్లో పెంచుతున్నారు. నర్సరీల్లో నీడ, పూల, పండ్లనిచ్చే మొక్కలతో పాటు కలప, ఈత, కర్జూర మొక్కలను కలుపుకొని మొత్తం ఏడు రకాల మొక్కలను పెంచుతున్నారు.

లక్ష్యం మేరకు నాటేనా..

వన మహోత్సవం కార్యక్రమంలో ఈ ఏడాదైనా అనుకున్న లక్ష్యం మేరకు మొక్కలు నాటుతారా లేదా అనే సందేహం నెలకొంది. పచ్చదనం పెంచేందుకు ప్రభుత్వం వన మహోత్సవం కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని చెబుతున్నా ప్రతి ఏటా లక్షల్లో లక్ష్యం పెట్టుకుని సగం మేర మాత్రమే మొక్కలు నాటుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. నాటిన మొక్కలకు కూడా నీరు అందించకపోవడంతో చాలావరకు ఎండిపోతున్నాయి. ఈసారైన అధికారులు లక్ష్యం మేరకు మొక్కలు నాటించి వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షాలు కురవగానే మొక్కలు నాటుతాం



మండలంలోని 30 నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నాం. వర్షాలు కురిసిన వెంటనే వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటుతాం. నర్సరీల్లో పండ్లు, పూల మొక్కలతో పాటు తాటి, ఈత మొక్కలు కూడా పెంచుతున్నాం.

– రాతికింది సురేష్, ఏపీఓ

కోదాడను అభివృద్ధి చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

కోదాడరూరల్ : కోదాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలోనే నియోజకవర్గంలో రూ.1900 కోట్ల నిధులతో అభివృద్ధితో పాటు అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యాయని అన్నారు. కోదాడ పట్టణంతో పాటు ఆరు మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే సహించేది లేదన్నారు. ఎక్కడైన అభివృద్ధి పనులు నాసిరకంగా చేపడుతున్నట్లు తెలిస్తే తన దృష్టికి తీసుకురావాలన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి, గ్రామీణ రోడ్లు, ఇందిరమ్మ ఇళ్లు, సాగునీటి లభ్యత, రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. అన్ని గ్రామాల్లో అర్హులైన నిరుపేదలకు తప్పకుండా ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని తెలిపారు. అవినీతి రహిత పాలన కొనసాగిస్తూ పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఆదర్శంగా నిలపడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. తమకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఈ సందర్భంగా విలేకరులు ఎమ్మెల్యేను కోరగా ఆమె సానుకూలంగా స్పందించారు.

క్రీడా ప్రాంగణాలు పరిశుభ్రం



సీతరాంతండా ప్రాథమిక పాఠశాల ఆవరణలోని క్రీడాప్రాంగణాన్ని జేసీబీతో శుభ్రం చేస్తున్న దృశ్యం

చిలుకూరు : మండలంలోని క్రీడా ప్రాంగణాలు వినియోగంలో లేకపోవడంపై శుక్రవారం సాక్షి పత్రికలో నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి గ్రామ పంచాయతీ అధికారులు స్పందించారు. జెర్రిపోతులగూడెం గ్రామ పంచాయతీ ఆవాస గ్రామం సీతరాంతండా ప్రాథమిక పాఠశాల ఆవరణలో అపరిశుభ్రంగా క్రీడా ప్రాంగణాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శి రెడ్డిమల్ల వెంకటేశ్వర్లు శుభ్రం చేయించారు. క్రీడా ప్రాంగణాలను అందుబాటులోకి తీసుకొచ్చి సౌకర్యాలు కల్పిస్తామని కొమ్ముబండతండా, జెర్రిపోతులగూడెం కార్యదర్శులు పూల వాసు, వెంకటేశ్వర్లు తెలిపారు.

మఠంపల్లిలో హెలెన్ కెల్లర్ జయంతి వేడుకలు



హెలెన్ కెల్లర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వికలాంగుల సేవా సమితి నాయకులు

మఠంపల్లి : హెలెన్ కెల్లర్‌ను దివ్యాంగులు ఆదర్శంగా తీసుకోవాలని వికలాంగుల సేవా సమితి నియోజకవర్గ నాయకుడు వేముల జోసెఫ్ అన్నారు. రచయిత్రి, దివ్యాంగుల ఉద్యమాల సారథి హెలెన్ కెల్లర్ జయంతి వేడుకలను శుక్రవారం మండల కేంద్రంలో వికలాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అంధురాలు, పుట్టుచెవుడుతో జన్మించిన హెలెన్ కెల్లర్ తన అద్భుత ప్రతిభతో అత్యున్నత శిఖరాలను అధిరోహించారని తెలిపారు. కార్యక్రమంలో జానో జాగో జిల్లా అధ్యక్షుడు జానీభాష, వికలాంగుల సమితి నాయకులు పోతబత్తిని శ్రీనివాస్, ప్రభుదాస్, సీహెచ్.కోటయ్య, బి.గోపాల్, షేక్ అమీర్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



ఎంపీడీవోకు సమ్మె నోటీస్ అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

గరిడేపల్లి : జూలై 9న నిర్వహించతలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్‌కె యాకూబ్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సరోజకు సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జీపీ వర్కర్స్ మండల అధ్యక్షుడు కొండ సైదులు, రామారావు, గోపాలకృష్ణ, రాజు, వెంకటరత్నం, సీతమ్మ, దామోదర్, సైదులు, మామిడి గోపి, సిద్దయ్య, వెంకన్న, విశాఖ, నాగాచారి, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి

నేరేడుచర్ల : వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నేరేడుచర్ల మున్సిపాలిటీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం పరిసరాల పరిశుభ్రతపై మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి అవగాహన కల్పించారు. ప్రస్తుత వర్షాకాలంలో ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్త రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వేయకుండా ఇంటి వద్దకు వచ్చే చెత్త వాహనాల్లో తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

మట్టపల్లి క్షేత్రంలో విశేష పూజలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహునికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యాగ్నిహోత్రి, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, అమ్మవార్లకు కుంకుమార్చనలు చేపట్టారు. అనంతరం ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. ఆ తర్వాత విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మాంగళ్యధారణ, తలంబ్రాలతో నిత్యకల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్‌కుమార్, అర్చకులు తూమాటి రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ రోజులను గుర్తుచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



నడిగూడెం పోలీస్‌స్టేషన్‌లో నిరసన తెలుపుతున్న సత్యనారాయణ, కార్మికులు

నడిగూడెం : కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ రోజులను గుర్తు చేస్తోందని తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ విమర్శించారు. తమ సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్మికులు జూలై నెలలో దేశవ్యాప్త సమ్మె చేపట్టిన నేపథ్యంలో శుక్రవారం కార్మికులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. దీంతో నడిగూడెం పోలీస్‌స్టేషన్‌లో జీపీ కార్మికులతో కలిసి ఆయన నిరసన తెలిపి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని అన్నారు. ఈ ప్రభుత్వానికి కూడా ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. ప్రభుత్వం తక్షణమే గ్రామ పంచాయతీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మల్లెల వెంకన్న, గ్రామ పంచాయతీ అధ్యక్షుడు సీమట నాగరాజు, ఉపేంద్రమ్మ, వెంకటమ్మ, సుభాని, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, వెంకన్న, భువనేష్ తదితరులు పాల్గొన్నారు.

రాములమ్మకు నివాళి

గరిడేపల్లి: మండలంలోని పొనుగోడుకు చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు చింతకుంట్ల వెంకట్‌రెడ్డి సతీమణి రాములమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. రాములమ్మ మృతదేహాన్ని సీపీఎం మండల కార్యదర్శి యాకూబ్ సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాయకులు నందిపాటి మట్టయ్య, మండవ సైదులు, తిరపయ్య, వెంకటప్పయ్య, రాములు, పూర్ణచంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

పెన్‌పహాడ్ : హమాలీ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని దూపహాడ్ గ్రామంలోని శ్రీరామ్ రైస్ మిల్లు హమాలీ కార్మికులతో కలిసి గుమస్తా సందీప్‌కు సమ్మె నోటీసు అందజేశారు. హమాలీ కార్మికులు రామ్ బాలక్, జితేందర్, రాజు, కృష్ణ, ఉదయ్, జానీ తదితరులు పాల్గొన్నారు.

వానొస్తే దుకాణాలు జలమయం



గణపవరం రోడ్డులో దుకాణంలోకి చేరిన వర్షపునీరు

మునగాల : మండల కేంద్రంలోని గణపవరం రోడ్డులో డ్రెయినేజీని ఆక్రమించడంతో చిన్నపాటి వర్షం వచ్చినా వర్షపునీరు రోడ్డు పక్కన ఉన్న దుకాణాల్లోకి చేరుతోంది. మండల కేంద్రంలోని అండర్‌పాస్ బ్రిడ్జి నుంచి సుమారు వంద మీటర్ల పొడవున రోడ్డుకు ఇరుపక్కల పలు దుకాణ సముదాయాలు ఉన్నాయి. ఇటీవల గణపవరం రోడ్డులో సుమారు 800 మీటర్ల పొడవున సీసీరోడ్డు నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. కానీ రోడ్డు ఓ పక్కన ఉన్న డ్రెయినేజీ ఆక్రమణకు గురికావడంతో వర్షపునీరు రోడ్డుపై రెండు అడుగుల లోతు నిల్చి ఉండడమే కాక రోడ్డు పక్కన ఉన్న దుకాణాల్లోకి వచ్చి చేరుతుండడంతో యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం మండల కేంద్రంలో కురిసిన మోస్తరు వర్షానికి రోడ్డుపై నిలిచిన నీరు దుకాణాలలోకి వచ్చి చేరింది. తక్షణమే గ్రామ పంచాయతీ స్పందించి ఆక్రమణలకు గురైన డ్రెయినేజీని పునరుద్ధరించాలని పలువురు వ్యాపారస్తులు కోరుతున్నారు.

గీత కార్మిక సంఘం నాయకుడి మృతి

నడిగూడెం : మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన గీత కార్మిక సంఘం నాయకుడు కుక్కడపు పున్నయ్య (76) గత కొంతకాలంగా అనారోగ్యానికి గురై శుక్రవారం మృతి చెందారు. పున్నయ్య మృతి పట్ల గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల వీరాంజనేయులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూతూకూరి వెంకటరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు రెణబోతు రామిరెడ్డి, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతాపం ప్రకటించారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం



హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ కళాశాలల ప్రాంగణంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో భవనాల నిర్మాణాలనికి శంకుస్థాపన

హుజూర్‌నగర్ : పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్‌లో ప్రభుత్వ జూనియర్ కాలేజీలో రూ.7.25 కోట్లతో, డిగ్రీ కాలేజీలో రూ.4.65 కోట్లతో చేపట్టనున్న నూతన భవనాల నిర్మాణాలకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ.. సంపన్న వర్గాల పిల్లల మాదిరిగానే నిరుపేదల పిల్లలు కూడా ఉన్నత విద్య అభ్యసించేలా కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని కళాశాలలకు, పాఠశాలలకు ఎల్లవేళలా తన సహకారం ఉంటుందన్నారు. డిగ్రీ, జూనియర్ కాలేజీలకు రూ.6 లక్షలతో కంప్యూటర్లు, ప్రింటర్లు అందించినట్లు తెలిపారు. మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, కాలేజీల భవనాలకు మరమ్మతులు, జంబో ఫ్యాన్లు, కంప్యూటర్లు, ప్రింటర్లు మంజూరు చేపిస్తానని, మంచినీటి కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. జూనియర్, డిగ్రీ కళాశాలలో టాపర్లకు నా యొక్క వ్యక్తిగత నిధుల నుంచి గోల్డ్ మెడల్ అందిస్తానని చెప్పారు. తను కళాశాలలో చదువుకోలేదని, కళాశాల జీవితం అనుభవించాలని తనకు ఎప్పటినుంచో కోరిక ఉండేదన్నారు. 16 ఏళ్లకే మిలటరీలో చేరి మిలిటరీ స్కూల్‌లో గ్రాడ్యుయేట్ పూర్తి చేశానని తెలిపారు. ఆ తరువాత యుద్ధ విమానాల పైలెట్ శిక్షణ తీసుకొని చైనా, పాకిస్తాన్ బోర్డర్‌లో పనిచేసి మిగ్ 21, 23 యుద్ధ విమానాలు నడిపానని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో, నియోజకవర్గంలో రోడ్లు, ఇందిరమ్మ ఇళ్లు, ఇరిగేషన్ ప్రాజెక్టులు ఇలా రాబోయే కాలంలో మరింత అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. పేదలకు సన్న బియ్యం పంపిణీలో రాష్ట్రం చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. అనంతరం పలువురు వివిధ సమస్యలపై మంత్రికి వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఈడబ్ల్యూ ఐడీసీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ శైలజ, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ డిప్యూటీ ఇంజనీర్ రమేష్, డిగ్రీ, జూనియర్, మైనార్టీ కాలేజీల ప్రిన్సిపాల్స్ రామారావు, శ్రీనివాస్, రహన బేగం ఏఎంసీ చైర్‌పర్సన్ రాధిక అరుణ్‌కుమార్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్, మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ డి.శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్, డీవీ. ఈ.సుబ్బారావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గోరింటాకు పండుగ.. ఆనందాల వేడుక



గోరింటాకు పెట్టుకొని సందడి చేస్తున్న ఆర్యవైశ్య, వాసవీమాత సేవా సంఘం సభ్యులు

మఠంపల్లి : మఠంపల్లిలో ఆర్యవైశ్య మహిళా సంఘం, శ్రీ వాసవీ మాతసేవా సంఘం మహిళలు శుక్రవారం ఆషాడ మాసం గోరింటాకు పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు సంప్రదాయ దుస్తులు ధరించి వివిధ రకాల డిజైన్లతో చేతులకు గోరింటాకు పెట్టుకుని ఆటాపాటలతో సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షురాలు కుక్కడపు సంధ్యారాణి, ఉపాధ్యక్షురాలు చీదెళ్ల స్వాతి, కార్యదర్శులు వంగవేటి భూలక్ష్మి, కొత్త శ్యామల, వంగవేటి పద్మావతి, కార్యవర్గ సభ్యురాళ్లు, ఆర్యవైశ్య సంఘం మహిళలు పాల్గొన్నారు.

సీఐ చరమందరాజుకు మెరిటోరియస్ సర్వీస్ రివార్డు



సీఐ చరమందరాజుకు మెరిటోరియస్ సర్వీస్ రివార్డు అందజేస్తున్న ఎస్పీ నరసింహ

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు పోలీస్ మెరిటోరియస్ సర్వీస్ రివార్డు లభించింది. ఈమేరకు ఐజీ కార్యాలయం నుంచి వచ్చిన మెరిటోరియస్ సర్వీస్ రివార్డును ఎస్పీ నరసింహా గురువారం రాత్రి సీఐ చరమందరాజుకు అందించి శుభాకాంక్షలు తెలిపారు. జైలు శిక్ష అనుభవిస్తూ పెరోల్‌పై వచ్చి ఆరేళ్లుగా తప్పించుకుని తిరుగుతున్న ఖైదీని అరెస్టు చేసిన కేసులో హుజూర్‌నగర్ సీఐని, మఠంపల్లి పోలీసులను, జిల్లా ఐటీ కోర్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఉత్తమ విధులు నిర్వర్తించే పోలీస్ సిబ్బందికి అందించే రివార్డులలో అత్యుత్తమైనది మెరిటోరియస్ సర్వీస్ రివార్డు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, కోదాడ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి ఉన్నారు.

ముమ్మరంగా లైనింగ్ పనులు



ముకుందాపురం శివారులో ముక్త్యాల బ్రాంచి కాలువ లైనింగ్ పనులు నిర్వహిస్తున్న దృశ్యం

- రూ.184.60 కోట్లతో ముక్త్యాల బ్రాంచి కాలువ లైనింగ్ పనులు
- నీటి విడుదల నాటికి పూర్తయ్యేలా పనుల్లో వేగం పెంచిన అధికారులు

మునగాల : నాగార్జునసాగర్ ఎడమ కాలువకు అనుబంధంగా ఉన్న ముక్త్యాల బ్రాంచి కాలువ లైనింగ్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రూ.184.60 కోట్ల వ్యయంతో గత నెలన్నర రోజులుగా పనులు జరుగుతున్నాయి. పనులను నీటిపారుదల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. కాలువలో నీటి వృథాను అరికట్టడంతో పాటు చివరి భూములకు నీరందేలా, నీటి ప్రవాహ వేగాన్ని పెంచడం, కాల్వ కట్టలను పటిష్టం చేసేందుకు పనులు చేపడుతున్నారు. మునగాల హెడ్ రెగ్యులేటర్ నుంచి ప్రారంభమై కోదాడ డివిజన్ పరిధిలో 16కి.మీ, హుజూర్‌నగర్ డివిజన్ పరిధిలో 29కి.మీ. పొడవు ఉండే ఈ ముక్త్యాల బ్రాంచి కాలువ సుమారు 45 వేల ఎకరాల పైచిలుకు ఆయకట్టు భూమికి సాగునీరు అందిస్తోంది. ముక్త్యాల బ్రాంచి కాలువపై తొమ్మిది అండర్ టన్నెల్స్, రెండు డబుల్ లైన్ రోడ్డు బ్రిడ్జిలు ఉన్నాయి. కాగా కోదాడ డివిజన్ పరిధిలో మునగాల, చిలుకూరు మేజర్ కాలువలు ఉండగా హుజూర్‌నగర్ డివిజన్ పరిధిలో చింత్రియాల, మఠంపల్లి, లింగగిరి, రాంపూర్, గుండ్లపల్లి మేజర్ కాలువలు ఉన్నాయి.

వీలైనంత త్వరగా పూర్తి చేస్తాం

ముక్త్యాల బ్రాంచి కాలువ లైనింగ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలోని బరాఖత్‌గూడెం వద్ద ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం మట్టి, కాంక్రీట్ పనులను చేపడుతున్నాం. నీటిపారుదల శాఖ ఉన్నత అధికారుల పర్యవేక్షణలో పనులు నడుస్తున్నాయి. వీలైనంత త్వరలో లైనింగ్ పనులను పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నాం.

– దాసరి మల్సూర్, ఏఈఈ
నీటిపారుదల శాఖ, కోదాడ డివిజన్

నీటి విడుదల నాటికి పూర్తయ్యేలా..

చివరి భూములకు ముక్త్యాల బ్రాంచి కెనాల్ ద్వారా పూర్తిస్థాయిలో నీరు అందకపోవడంతో ప్రతి యేట సాగు చేసిన వందల ఎకరాల పంటలు ఎండిపోతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని నీటిపారుదల శాఖ ముక్త్యాల బ్రాంచి కాలువ కట్టలకు లైనింగ్ నిర్మిస్తే చివరిభూములకు పూర్తిస్థాయిలో నీరు అందే అవకాశం ఉందనే ఉద్దేశ్యంతో ఈ లైనింగ్ పనులకు ఉపక్రమించింది. మండలంలోని బరాఖత్‌గూడెం నుంచి ప్రారంభమైన లైనింగ్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ ఏడు కాలువకు నీటి విడుదల చేసే సమయానికి లైనింగ్ పనులు పూర్తి చేయాలన్నదే అధికారుల లక్ష్యంగా పనులు సాగుతున్నాయి.